క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యారణ్యపురి: ఈనెల 22, 23వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సర్వీన్ సుల్తానా పాల్గొననున్నారని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమ, వ్యాయామ ఉపాధ్యాయురాలు శోభ గురువారం తెలిపారు. ఈనెల 16న జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఆ విద్యార్థి పాల్గొని సత్తా చాటిందని తెలిపారు. ఈమేరకు ఆమెను పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

మంజులాదేవికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు బి.మంజులాదేవికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సాహిత్య అకాడమీ అవార్డ్ విన్నింగ్ నోవెల్స్ ఎథిమటిక్ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఇంగ్లిష్ నోవెల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మంజులాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తమ్ పర్యవేక్షణలో మంజులాదేవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ప్రపంచ టెలివిజన్ దినోత్సవం



వరంగల్ చౌరస్తా: ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ఓరుగల్లు ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని కొండూరు వారి వీధిలో గురువారం వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పూకంటి మహేందర్, ప్రధాన కార్యదర్శి దుంపేటి శ్రీనివాస్, కోశాధికారి పాలడుగుల లక్ష్మణకాంత్, సహాయ కార్యదర్శి బలభద్ర మురళి, సహాయ కోశాధికారి బొంపెల్లి శ్రీధర్, ఆర్గనైజర్ పల్లె మహేందర్, కార్యవర్గ సభ్యులు పిట్ట రాజేశ్వర్, రావిరాకుల గణేష్, రామ్మోహన్, శ్రీధర్, ప్రసాద్, శోభన్‌రాజ్, మూర్తి, చందు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ మండల అధ్యక్షుడిగా మణికంఠ

ఖిలా వరంగల్: కిక్ బాక్సింగ్ వరంగల్ మండల అధ్యక్షుడిగా కొత్తవాడకు చెందిన గడదాసు మణికంఠ నియామకమయ్యారు. ఈమేరకు మణికంఠకు వరంగల్ పోర్టురోడ్డులోని శివనగర్ భూపేష్‌నగర్‌లో కిక్ బాక్సింగ్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎమ్మడి సంజీవకుమార్‌తో కలిసి జిల్లా అధ్యక్షుడు కొయ్యాడ ప్రభాకర్ గౌడ్ నియామక పత్రాన్ని గురువారం అందజేశారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అనిల్

హసన్‌పర్తి: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పలివేల్పుల మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి సంగాల కమల్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా అనిల్‌కు కుడా మాజీ డైరెక్టర్ నన్నబోయిన రమేష్‌యాదవ్, కోచ్ కమల్ బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మేయర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు

వరంగల్ అర్బన్: వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణిని గ్రేటర్ వరంగల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేయడంపై ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పూజారి శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు కొత్తగట్టు సుధాకర్, ఉపాధ్యక్షుడు మేకల రమేష్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, సోమయ్య, ప్రతినిధులు సోమయ్య, కోటేశ్వర్, ఎల్లయ్య, మల్లయ్య, గోల్కొండ సాంబయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమేధాలో ఫ్రెషర్స్ డే వేడుకలు



వరంగల్: వరంగల్ పోచమ్మమైదానంలోని శ్రీమేధా కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సతీష్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి.. తన తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కార్తీక్‌గౌడ్, వైస్ చైర్మన్ స్వప్నగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ కొయ్యడి వీరన్నగౌడ్, కళాశాల డైరెక్టర్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులతో జాగ్రత్త!

- జిల్లాలో 184 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తేనే మేలంటున్న అధికారులు



కోత దశలో ఉన్న వరి



బొల్లికుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలోని చెరువులు, కాల్వలు, బోరు బావులు కింద ఈ ఖరీఫ్ సీజన్‌లో 88వేల ఎకరాల్లో సన్నరకం, 38వేల ఎకరాల్లో దొడ్డు రకం వరి పంటను రైతులు సాగు చేశారు. ఈసారి ముందుగా వర్షాలు కురవడంతో ఆగస్టులోపు రైతులు వరినాట్లు పూర్తి చేశారు. గత సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కొంత జాప్యం జరగడంతో ధాన్యాన్ని కల్లాలోనే రోజుల తరబడి నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి సమస్య పునరావృతం కావొద్దనే ఆలోచనతో ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో మొత్తం 184 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 114 కేంద్రాల్లో సుమారు 201.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేశారు. వాటి నిర్వహణ బాధ్యతలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీలకు అప్పగించారు. 17శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ ధాన్యం క్వింటాకు రూ.2,300 చొప్పున కొనుగోలుకు ప్రభుత్వం ధర నిర్ణయించింది.

దళారులకు పంటను విక్రయించొద్దు

రైతుల ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. తొందరపడి దళారులకు తమ పంటను అన్నదాతలు విక్రయించవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320కాగా, సాధారణ రకం ధాన్యాన్ని క్వింటాల్ రూ.2,300 ప్రకారం ధర చెల్లించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి ప్రకటించిన బోనస్ క్వింటాకు రూ.500 చొప్పున నగదు ఈ సీజన్ నుంచి రైతులకు అందనుందని అధికారులు చెబుతున్నారు. సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు రానివ్వం

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తేనే మద్దతు ధర లభిస్తుంది. దళారులకు విక్రయించి దగా పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం. ధాన్యం విక్రయించిన వెంటనే బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు వస్తే ధాన్యం తడవకుండా కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. కొనుగోలు కేంద్రాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం.

– సంధ్యారాణి, డీఎం, వరంగల్

నిబంధనలు ఇలా..

కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకుని వచ్చిన వెంటనే కేంద్రం, నిర్వాహకులు ధాన్యాన్ని కింద పోస్తారు. రికార్డులో రైతుల పేరుతో పాటు పూర్తి వివరాలు నమోదు చేసుకుంటారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తారు. ధాన్యం తేమ 15 - 17 శాతం వచ్చిన తరువాతనే సదరు రైతుకు కొనుగోలుకు సంబంధించిన టోకెన్ ఇస్తారు. ధాన్యం మిల్లులకు తరలించే క్రమంలో గన్నీ సంచులపై సన్నరకం ఉంటే ఎస్ అన్ని దొడ్డు రకం ఉంటే డీ అని గుర్తులు పెడతారు. సన్న రకం ధాన్యంపై అనుమానం ఉంటే మైక్రో మీటర్ ద్వారా రైతులు, కేంద్ర నిర్వాహకుల సమక్షంలో గింజను ఏఈఓ కొలుస్తారు.

రైతులు ఇలా చేయాలి

రైతు తమ వెంట ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం నకలు రెండు సెట్లు తీసుకురావాలి.

ఆధార్, పాసు పుస్తకాలను ఆన్‌లైన్ చేయించుకోవాలి. ధాన్యం కాంటా అయిన వారం రోజుల్లో బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

కేంద్రం విధానాలను ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యూశాయంపేట: కేంద్రంలో మూడోసారి అధికారానికి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పాల్పడుతున్న కార్మిక, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటించాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చుక్కయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రావు సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసారెడ్డి, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రామ్మూర్తి అధ్యక్షతన గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఏఐఏడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, యూటీయూసీ నాయకుడు శివాజీ, మహేష్, మల్లేశం, ఉపేందర్ పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం ద్వారానే ఆర్థికాభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న చిరంజీవులు

హన్మకొండ: రాజ్యాధికారం ద్వారానే బీసీలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని మాస్టర్‌జీ డిగ్రీ కళాశాలలో బీసీ ఐక్య మేధావుల సంఘం ఆధ్వర్యంలో బీసీ ఉద్యమ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, సమస్యల పరిష్కారం అనే అంశాలపై గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా బలపడాలంటే రాజకీయంగా రాణించాలని, అందుకు రాజ్యాధికారం అవసరమన్నారు. రాష్ట్రంలో అనేక బీసీ సంఘాలు ఉన్నప్పటికీ వారి మధ్య సఖ్యత లేక బీసీలు రాజకీయంగా రాణించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనతో బీసీలకు మరింత లాభం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమగ్ర సర్వేపై కొన్ని పార్టీలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, ఆయా సంఘాల నాయకులు గడ్డం భాస్కర్, వడ్నాల నరేందర్, వైద్యం రాజగోపాల్, బచ్చు ఆనందం, చందా మల్లయ్య, వేణుగోపాల్, డాక్టర్ కూరపాటి రమేష్, చేరాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలి



మాట్లాడుతున్న తాళ్లపల్లి కుమార్

హన్మకొండ: వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సామాజిక పింఛన్లు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొనడంతోపాటు బహిరంగ సభల్లోనూ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా పింఛన్లు పెంచలేదని విమర్శించారు. సామాజిక పింఛన్లు పెంచాలనే డిమాండ్‌తో ఈనెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీక్షలో అమరాజు స్వామి, బాపు రాజుయాదవ్, సింగారపు రజిత, కన్నూరి చంద్రశేఖర్, సింగారపు స్వామి, వక్కల భాగ్య, సోనబోయిన చేరాలు, గందపల్లి ముత్యాలు, చినపెల్లి కొమురయ్య, బి.లక్ష్మి, కె.ప్రేమలత, కె.యాదమ్మ, యాకలక్ష్మి పాల్గొన్నారు.

పంటల మద్దతు ధర చట్టానికి పోరాటం



ఏనుమాముల మార్కెట్‌లో నాయకులు

వరంగల్: పంటల కనీస మద్దతు ధర చట్టం, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు వీరగోని శంకరయ్య, సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్, సుంచు జగదీశ్వర్, పుల్ల రమేష్, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి సుధమల్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈనెల 26న జరగనున్న కార్మిక కర్షక ప్రజా దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ కుసుంబ బాబూరావు, కార్మిక సంఘాల బాధ్యుడు గంగుల దయాకర్ నేతృత్వంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులు, కార్మికులను కలిసి గురువారం కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.

రిజర్వేషన్‌లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్ల అమలులో సముచిత స్థానం కల్పించాలని హనుమకొండ జిల్లా బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుడు సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చిన బీసీ డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రొఫెసర్ వినయ్‌బాబు, గంగాపురం వేణుమాధవ్, వివేక్, అడ్వకేట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మేర కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: మేర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వరంగల్ జిల్లా మేర సంఘం అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చిన బీసీ డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్, సంపత్‌కుమార్ మాట్లాడుతూ మేర కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. హనుమకొండ జిల్లా మేర సంఘం అధ్యక్షుడు తాళ్ల దయానంద్, భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి రవీందర్, గట్ల రాజయ్య, వరంగల్ జిల్లా మేర సంఘం ఉపాధ్యక్షుడు కొత్తకొండ విద్యాసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నే రవీందర్, వరంగల్ పట్టణ అధ్యక్షుడు వోడపల్లి వీరన్న, హనుమకొండ కార్యదర్శులు రాపర్తి శ్రీధర్, వోడపల్లి సాగర్, వరంగల్ పట్టణ కార్యదర్శి రామగిరి సతీష్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లోని జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లకు చదువుతోపాటు సామాజిక సేవాదృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లతో క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడారు. సమావేశంలో కేడీసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌రావు, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులు ఐక్యత చాటాలి



కాజీపేట: జెండాను ఆవిష్కరిస్తున్న సభ్యులు

హన్మకొండ: ముదిరాజ్‌లు తమ ఐక్యతను చాటాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మెపా కార్యాలయంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి సింగారపు రామకృష్ణ, ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, తాళ్ల రవీందర్ ముదిరాజ్, కట్ల విజయ్, ఆళ్ల నరేష్ ముదిరాజ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని తూర్పుకోట, తిమ్మాపురం, అల్లీపురంలో మత్స్య పారిశ్రామిక సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తూర్పుకోటలో సొసైటీ అధ్యక్షుడు సంగరబోయిన చందర్, తిమ్మాపురంలో మత్స్యపారిశ్రామిక సొసైటీ అధ్యక్షుడు మేకల సూరయ్య జెండాలను ఆవిష్కరించారు.

27వ డివిజన్‌లో..

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్‌లో ముదిరాజ్‌లు గురువారం వేడుకలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బయ్యా స్వామి హాజరై జెండా ఎగురవేశారు. పెద్దమ్మతల్లి ఆలయ అధ్యక్షుడు యాట సత్యనారాయణ, గోవిందరాజుల గుట్ట రథసారథులు చింతాకుల సునీల్ కుమార్, స్థానిక కార్పొరేటర్ చింతకుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సోమిడిలో..

కాజీపేట: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్‌లు కాజీపేట మండలం సోమిడి గ్రామంలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ముదిరాజ్ మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు సుంచు రఘురాం ఎగురవేశారు. మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, సుంచు చంద్రయ్య, సంఘం సభ్యులు సుంచు కృష్ణ, సుంచు శ్రీహరి, పెసరు రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు తప్పని తిప్పలు

హన్మకొండ అర్బన్: వడ్డేపల్లి చెరువులో చేపల వేటతో జీవనోపాధి పొందే మత్స్యకారులు చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విన్నవించారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా స్వయంగా వారే చెరువులోకి దిగి గుర్రపుడెక్కను తొలగించి వినూత్న నిరసన తెలిపారు.

బ్యాంకు అధికారులు జాగ్రత్త



వరంగల్ క్రైం: ఇటీవల రాయపర్తిలో జరిగిన బ్యాంకు దోపిడీ నేపథ్యంలో సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకుల శాఖల అధికారులకు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు భద్రతాపరమైన సూచనలు చేస్తూ నోటీసులు అందజేశారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది, లాక్ సిస్టం, అలారం వంటి వాటిని నిత్యం తనిఖీ చేయాలని పేర్కొన్నారు.

బ్యాంకుల్లో అలారం సిస్టమ్ తప్పనిసరి

హసన్‌పర్తి: బ్యాకుల్లో అలారం సిస్టమ్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బ్యాంకర్లతో యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బ్యాంక్‌ల్లో రాత్రివేళల్లో సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంక్‌కు అన్నివైపులా సీసీ కెమెరాలు బిగించుకోవాలని, బ్యాంక్‌కు వచ్చే అపరిచితులను గమనిస్తూ ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్సై రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఖిలా వరంగల్: అన్ని బ్యాంకుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, మరమ్మతులు వస్తే వెంటనే చేయించుకోవాలని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం సూచించారు. ఈమేరకు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో బ్యాంకు భద్రతలపై బ్యాంకర్లకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఎస్సైలు రవీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో బ్యాంకుల తనిఖీ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులను సిబ్బందితో కలిసి సీఐ సుధాకర్ రెడ్డి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. బ్యాంకుల్లో సీసీ కెమెరాల పనితీరుతో పాటు అలారం సిస్టమ్‌పై ఆయా బ్యాంకుల మేనేజర్లతో చర్చించారు. తనిఖీల్లో ఎస్సైలు శివకృష్ణ, నవీన్ కుమార్, లవన్ కుమార్ పాల్గొన్నారు.

త్వరలో సబ్ డివిజనల్ ఆస్పత్రిగా రైల్వే ఆస్పత్రి



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించిన సికింద్రాబాద్, కాజీపేట రైల్వే వైద్యులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రి త్వరలో సబ్ డివిజనల్ ఆస్పత్రిగా మారనుందని, అందుకు సంబంధించిన ఫైల్ అనుమతి కోసం రైల్వే బోర్డులో ఉందని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ (పీసీఎండీ) డాక్టర్ సీకే.వెంకటేశ్వర్లు అన్నారు. ఆయనకు సికింద్రాబాద్ డివిజన్ స్థాయి సన్మానం, వీడ్కోలు కార్యక్రమం కాజీపేట రైల్వే ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లను సికింద్రాబాద్ డివిజన్ వైద్యులు, కాజీపేట రైల్వే వైద్యులు, చీఫ్ ఫార్మసిస్టులు, ఫార్మసిస్టులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాథమిక చికిత్స సీపీఆర్ డెమోను డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్ ప్రదర్శించి వివరించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణస్వామి, కాజీపేట రైల్వే ఆస్పత్రి వైద్యులు నిరంజన్, హరిబాబు, నరేందర్, రాజేందర్, అమల, శ్రీనివాస్, చీఫ్ ఫార్మసిస్టులు చింత తిరుపతి, హరీష్, సులోచన, మానస, వైద్య సిబ్బంది సంతోష్, ప్రసాద్, భిక్షపతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కాళోజీ సెంటర్: ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, పెండింగ్ బిల్లులు, నాలుగు డీఏలు చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన వరంగల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ధర్మ పరిరక్షణకు సమష్టిగా పోరాడుదాం

హన్మకొండ: ధర్మ పరిరక్షణకు సమష్టిగా పోరాడుదామని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని పార్కులో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జాతీయవాదుల సమావేశాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హిందువులు, హిందూ సమాజంపై జరుగుతున్న దాడులను హిందువులంతా ఖండించాలని పిలుపునిచ్చారు.

శ్మశాన వాటికలో విద్యుత్ దీపాల ఏర్పాటు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్మశాన వాటికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత తన సొంత ఖర్చులతో వాటిని సమకూర్చారు. శ్మశాన వాటికలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో మృతుల అంత్యక్రియల కోసం వచ్చినవారు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో కార్పొరేటర్ స్పందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ రోడ్డు పీఆర్సీ భవనం వద్ద మినీ ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. దాంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసి నీళ్లతో మంటలను విద్యుత్ సిబ్బంది, స్థానికులు అదుపులోకి తెచ్చారు.

సీపీఎం మహాసభను జయప్రదం చేయాలి

కాజీపేట అర్బన్: డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న సీపీఎం కాజీపేట మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కయ్య కోరారు. న్యూశాయంపేట సుర్జీత్‌నగర్‌లోని సీపీఎం కమిటీ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా, సమాజంలోని నిరుపేదలకు అండగా సీపీఎం ఉంటోందని అన్నారు. ప్రధాన కార్యదర్శి జంపాల రమేష్, విమల, వనమాల, మదన్, రజిత, కేతమ్మ, సాంబయ్య, కారు ఉపేందర్ పాల్గొన్నారు.

24న గౌడ కార్తీక వన భోజనాలు

నయీంనగర్: ఈనెల 24 గౌడ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఖిలా వరంగల్ ఏకశిల చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించనున్నట్లు గోపా నాయకులు చిర్ర రాజుగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గౌడ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సౌల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

కాజీపేట రూరల్: సౌల్స్ ఆఫ్ క్రైస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అబ్రి విన్సెంట్, సభ్యులు ఎనోష్ డేవిడ్, రాబర్ట్ సిల్వ, చైతన్య ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద పేదలకు గురువారం అన్నదానం చేశారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, ఎస్సై రమణకుమార్, 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు పాల్గొన్నారు.

ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నారు

విద్యారణ్యపురి: ఇంటర్ పరీక్ష ఫీజు పేరుతో నిర్దేశించిన పరీక్ష ఫీజు కంటే కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నారని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి అన్నారు. అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఐఈఓ గోపాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

వనభోజనాన్ని విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: ఈనెల 24న ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో జరగనున్న పద్మశాలీల వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం ప్రతినిధి మేరుగు అశోక్ పిలుపునిచ్చారు. వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో పద్మశాలి ఉమ్మడి జిల్లా సంఘం ప్రతినిధులు శివనగర్‌లో గురువారం పర్యటించారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో కవాతు చేస్తాం

హన్మకొండ: పోలీసులతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కవాతు చేయించి బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తే, ఆ బాధితులతోనే ఢిల్లీ వీధుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో కవాతు చేస్తామని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

స్టీమ్ రైస్ వద్దని వీసీకి వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామన్ మెస్‌లో స్టీమ్ ద్వారా వంటచేసిన అన్నం వద్దని, కట్టెల ద్వారానే వంటచేసి పెట్టాలని హాస్టళ్ల విద్యార్థులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ మృతి



సుధాకర్ (ఫైల్)

హన్మకొండ: హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ సుధాకర్ రెడ్డి (76) కన్నుమూశారు. అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు.